

జెడ్సీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రీన్‌పార్క్‌కాలనీవాసులు

జెడ్సీ కార్యాలయం ఎదుట ఆందోళన

ఎల్బీనగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సరైన ప్రణాళిక లేకుండా ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మించి గ్రీన్‌పార్క్‌కాలనీని మురుగునీట ముంచారని మండిపడుతూ గ్రీన్‌పార్క్‌కాలనీవాసులు బుధవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా కార్యాలయాలలో కూర్చుని రాజకీయ ఒత్తిళ్లతో ఎస్ఎన్‌డీపీ నాలా ప్రణాళిక రూపొందించారని కాలనీవాసులు ఆరోపించారు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా నాలాలో మురుగునీరు సాఫీగా వెళ్లకుండా కాలనీని ముంచెత్తుతున్నాయన్నారు. నాలా నుంచి మురుగునీరు రోడ్డెక్కి కాలనీ మొత్తం మురికి కూపంగా మారిందన్నారు. దీంతో కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్‌పార్క్‌కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వారు వినతిపత్రం సమర్పించారు.



అడ్డా వద్ద కార్మికులతో మాట్లాడుతున్న ఆలేటి ఎల్లయ్య

భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండాలి

మన్సూరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉంటూ తమ హక్కులను కాపాడుకోవాలని, ముఖ్యంగా అర్హులైన ప్రతి భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డును పొందాలని సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య సూచించారు. వనస్థలిపురం డివిజన్ ఎన్‌జీఓస్‌కాలనీలోని లేబర్ అడ్డా వద్ద కార్మికులతో బుధవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆలేటి ఎల్లయ్య కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం, లేబర్ బోర్డు ద్వారా అందే పథకాల గురించి అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లేబర్ అడ్డా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లాట్ల లక్ష్మణ్, కార్యదర్శిగా పి.శేఖర్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే బాషా, సైదులు, సహాయ కార్యదర్శులుగా బి.నాగయ్య, పి.శేఖర్, కార్యవర్గసభ్యులుగా ఎ.సైదులు, ఎం.జయమ్మ, బొడ్డు జయమ్మ, సభ్యులుగా రమావత్ చిట్టి, ప్రవీణ్, బోనాల సైదులు, శ్రీను, బి.లక్ష్మయ్య, జి.రమేష్, ఆలేటి లచ్చయ్య, రమణ, బాష, పిచ్చయ్య ఎన్నికయ్యారు.

విద్యుత్ స్తంభాలపై కేబుళ్లు తొలగించండి



డీఈ హన్మంతరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

సైదాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా ఉన్న కేబుళ్లను వెంటనే తొలగించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి బుధవారం ఆస్మాన్‌ఘడ్ డివిజన్ విద్యుత్ డీఈ హన్మంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వేలాడే కేబుళ్లతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు డీఈ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని దుర్గాభవానీనగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.40లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీల్లో అధునాతన హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు వెంకట్, గజేంద్రగౌడ్, శేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, కుమార్, శ్రీనివాస్‌గౌడ్, బద్రీరావు, శశిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలి

కొత్తపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలని హిమాయత్‌నగర్ రీజినల్ ఆఫీస్ బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ సుగుణావతి సూచించారు. బుధవారం ఆమె కొత్తపేట డివిజన్ పరిధి మోహన్‌నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఆమె పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు సునీత, అరుణజ్యోతి, సంధ్య, అంజనాదేవి, శైలజ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిరంజీవి యువత నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్ : మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజును పురస్కరించుకుని చిరంజీవి యువత అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బలిజగూడ గ్రామంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోడెపు సత్యనారాయణగౌడ్ హాజరై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పు రాజేష్, ఉప్పు స్వప్న పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



విద్యుత్ సమస్యలపై ఆరా తీస్తున్న ఏడీఈ శోభన్, ఏఈ ప్రసాద్

చాదర్‌ఘాట్ : చాదర్‌ఘాట్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఆజంపుర డీ క్లాస్ క్వార్టర్స్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చంచల్‌గూడ విద్యుత్ ఏడీఈ శోభన్ తెలిపారు. బుధవారం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా చాదర్‌ఘాట్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఆజంపుర డీ క్లాస్ క్వార్టర్స్‌లో ఆయన సెక్షన్ ఏఈ ప్రసాద్, సిబ్బందితో కలిసి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి క్వార్టర్స్ లేన్‌లో ఓవర్ హెడ్ కండక్టర్లను తొలగించి దాని స్థానంలో కొత్తగా ఏబీ కేబుల్‌ను బిగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏడీఈ వివరించారు.

సమేటి డైరెక్టర్‌గా నర్సింహారావు

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఓల్డ్ మలక్‌పేటలో ఉన్న స్టేట్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(సమేటి)డైరెక్టర్‌గా నర్సింహారావును ప్రభుత్వం నియమించింది. ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అగ్రికల్చర్ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు సమేటి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ డైరెక్టర్‌గా పనిచేసిన నారీమణి స్టేట్ అగ్రికల్చర్ కమిషనరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యింది.

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను గుర్తుంచుకోవాలి

కొత్తపేట : విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను గుర్తుంచుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. రాచకొండ పరిధిలోని ఘట్‌కేసర్ చౌదరిగూడ, నాచారం, పోచారం, నారపల్లి ప్రాంతాల్లో 6ప్రైవేటు విద్యాసంస్థలో 366 మంది విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో 8 కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



పన్యాల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగురోడ్డు వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ముద్దగౌని లక్ష్మీప్రసన్నారామ్మోహన్‌గౌడ్



తుర్కయంజాల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్

తుర్కయంజాల్ చౌరస్తాలో..

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం తుర్కయంజాల్ చౌరస్తాలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సునీల్‌తో పాటు బాస్కర్‌రావు, శ్రీశైలం, శ్యామల, అర్జున్, లోహిత్‌రెడ్డి, రాములు, ఎరుకలి రవి పాల్గొన్నారు.



ఎల్బీనగర్ చౌరస్తాలో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నినదిస్తున్న టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విప్లవానికి నాంది పలికి ఆధునిక భారతదేశానికి బాటలు వేసి ఆధునిక భారత్ ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌చౌరస్తా వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నారామ్మోహన్‌గౌడ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కొత్తపేట మాజీ కార్పొరేటర్ వజీర్‌ప్రకాశ్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైరామల్‌గూడలో..



బైరామల్‌గూడలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చంపాపేట : చంపాపేట డివిజన్‌లోని బైరామల్‌గూడలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మాజీ వార్డు సభ్యుడు కోయిలకొండ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఈపూరి బద్రీనాథ్‌గుప్తా, నాయకులు ఆల వెంకట్‌రెడ్డి, గోపాల్ ముదిరాజ్, వెంకటేష్, యంజాల సురేష్, ఎడ్ల లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



బొడ్రాయి ప్రతిష్ఠ ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బొడ్రాయి ప్రతిష్ఠాపన ఆహ్వానపత్రికను బుధవారం హయత్‌నగర్‌లోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ 9,10,11,12తేదీల్లో జరుగనున్న ఈ పండుగను కుల మతాలకు అతీతంగా నిర్వహించుకోవాలని కోరారు. బేదాభిప్రాయాలు రాకుండా రాజకీయాలకు అతీతంగా శాంతియుతంగా పండుగను జరుపుకోవాలన్నారు. గ్రామ పెద్దలందరు ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలన్నారు. తన సంపూర్ణ సహకారాలు ఉంటాయని తెలిపారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ హయత్‌నగర్‌కు గొప్ప చరిత్ర ఉందని అందుకు అనుగుణంగా బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించాలని గ్రామస్థులను కోరారు. ఐక్యమత్యంతో అందరు కలిసి పండుగలో పాల్గొనాలన్నారు. తన వంతుగా రూ.2లక్షలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా ఉండి కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలన్నారు. అనంతరం బొడ్రాయి పండుగ నిర్వహణపై గ్రామంలోని అన్ని కులాల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి వారి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈసందర్భంగా బొడ్రాయిని నేతాజీ కాలనీలో ప్రతిష్ఠించేందుకు తీర్మానించా రు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, గ్రామస్థులు గజ్జి భాస్కర్, నక్క దర్శన్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, బోడ భిక్షపతి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర వెంకటేశ్, స్కైలాబ్, రమేష్, సునీల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఒకే వేదికపై రాజకీయ ప్రత్యర్థులు.. సుధీర్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్

తరుచూ ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉప్పు.. నిప్పులా ఉంటున్న నేతలు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ బుధవారం ఒకే వేదికపైకి వచ్చారు. ఒకే వేదికను పంచుకున్న ఇ ద్దరు నేతలు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఇది చూసిన స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూనే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు బుధవారం అయ్యప్ప ఆలయంలో హయత్‌నగర్ బొడ్రాయి పండుగ ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించేందుకు ఇద్దరు వేర్వేరుగా హాజరై ఒకే వేదికపైన పక్కనే కూర్చుని పలకరించుకున్నారు.

ఆర్టిజన్ల కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

- టీజీఎస్‌సీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌కు ఎమ్మెల్యే బలాల వినతి



కేబుల్ ఆపరేటర్లతో కలిసి టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌తో సమావేశంలో ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగానే గుర్తించి విద్యుత్ స్తంభాలు, ఫీడర్లపై పనులు చేసే ఆర్టిజన్లు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోతున్నారని, ఆయా బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి చట్ట ప్రకారంగా అందాల్సిన రూ.కోటి పరిహారం ఇప్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ను కలిసి మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల విన్నవించారు. విద్యుత్ షాక్‌కు గురై ఆరుగురు ప్రాణాలు కోల్పోయిన రామంతాపూర్ ఘటనతో విద్యుత్ స్తంభాలకు బిగించిన కేబుల్ వైర్లను, నెట్ కేబుల్ తీగలను కట్ చేయడంతో తలెత్తుతున్న ఇబ్బందులపై కేబుల్ ఆపరేటర్లతో కలిసి ఎమ్మెల్యే సీఎండీని కలిశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలాంటి హెచ్చరికలు జారీచేయకుండానే విద్యుత్ స్తంభాలకు బిగించి ఉన్న కేబుల్ తీగలను నెట్ కేబుల్ తీగలను తొలగించే విషయంలో వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న లక్షలాది కుటుంబాల గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే విన్నవించారు. నెట్ కేబుల్ తీగలను తొలగించడం ద్వారా ఇంటర్నెట్‌పై ఆధారపడి పనులు చేసే లక్షలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, లక్షలాది రూపాయల లావాదేవీలకు ఆటంకం కలిగిందన్న విషయాన్ని గుర్తించి తీసుకున్న నిర్ణయంలో మార్పు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల ముసారాంబాగ్‌లో అంజద్ అనే ఆర్టిజన్ ఫీడర్‌పై మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందిన విషయాన్ని ఎమ్మెల్యే వివరిస్తూ అతనిపై ఆధారపడిన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉందన్నారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఆర్టిజన్ల కుటుంబాలను ఆదుకోవడానికి రూ.కోటి పరిహారం ఇచ్చేందుకు అవకాశమున్నా చట్టంలోని కొన్ని లోపాల కారణంగా కేవలం రూ.25లక్షల నుంచి రూ.30లక్షల వరకు పరిహారం వచ్చే అవకాశముందన్నారు. ఇందులోని లోపాలను సవరించి రూ.కోటి పరిహారంతో పాటు బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని ఆయన విన్నవించారు.



చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు విన్నవిస్తున్న గ్రేటర్ ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్

ట్యాంక్‌బండ్‌పై కృష్ణస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

చాదర్‌ఘాట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కుల వ్యవస్థాపకుడు హైదరాబాద్ నగరానికి ప్రప్రథమ మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాన్ని తెలంగాణ ప్రభుత్వం ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ముదిరాజ్ మహాసభ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి కట్ట కృష్ణముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఆయన కలిసి ఈమేరకు విన్నవించారు. దీనితోపాటు కృష్ణస్వామి ముదిరాజ్ పేరిట యూనివర్సిటీ ఏర్పాటు చేసేలా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కూడా విన్నవించాలని ఆయన చైర్మన్‌ను కోరారు.

సంస్కరించే భాష సంస్కృతం

- ఓయూ సంస్కృత భాషా విభాగం పూర్వ అధిపతి ప్రొఫెసర్ రాములు



ప్రొఫెసర్ రాములును సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ సుధాకర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సంస్కరించే భాష సంస్కృత భాష అని ఓయూ సంస్కృత భాషా విభాగం పూర్వ అధిపతి ప్రొఫెసర్ రాములు అన్నారు. అంతర్జాతీయ సంస్కృత భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద గ్రంథం శ్రీమద్ మహాభారతమని తెలిపారు. సరళ సంస్కృత భాషలో పద్దెనిమిది పర్వాల మహా భారతాన్ని ఐదు నిమిషాల్లో విద్యార్థులకు వివరించి సంస్కృత భాషపై సాహిత్యంపై అవగాహనను ఆసక్తిని రేకెత్తించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ పమ్మి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో సంస్కృత భాషా శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశిరాజు కామేశ్వర్‌రావు మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎన్నో సంస్కృత పదాలు మన వాడుకలో ఉన్నాయన్నారు. సంస్కృత భాష మన అందరిది అని, భాషాభివృద్ధికి పాటు పడాలన్నారు. విద్యార్థుల సంస్కృత ఉపన్యాసాలు, గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి.

గొప్పవారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉన్నత శిఖరాలకు చేరాలనుకునే విద్యార్థులు గొప్పవారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి సూచించారు. నగర శివారు కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన బీటెక్ ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని బాలకిష్టారెడ్డి, కళాశాల చైర్మన్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్, ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, వర్చుసా కంపెనీ హెచ్ఆర్ అభిషేక్, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మల్క నవీన్, డైరెక్టర్ డాక్టర్ రామశేషగిరి రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీ రాజు, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ డి. రమ్య, డీన్ అడ్మినిస్ట్రేషన్ అంబాల శ్రీధర్ పాల్గొన్నారు.

పనులు చేయకుండానే బిల్లుల స్వాహాపై విచారణ చేపట్టండి



డీఎస్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో ప లు అభివృద్ధి పనులు చేయకుండానే అధికారులు, కాంట్రాక్టర్ బిల్లులు స్వాహా చేసిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం డీఎస్‌నగర్‌లో పనులు ప్రారంభించకుండానే బిల్లులు కాజేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఎలాంటి పనులు చేయకుండానే డీఎస్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం రూ.18.60లక్షలు, అంగన్‌వాడీ సెంటర్ పక్కన మరో కమ్యూనిటీ హాల్ నిర్మాణం మిగిలిన పనులకు రూ.10.50లక్షలు, ఎస్‌బీహెచ్‌కాలనీ నుంచి సుబ్రహ్మణ్యనగర్ వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు రూ.22లక్షలు కాంట్రాక్టర్లకు చెల్లించారని ఆరోపించారు. ఈ అవినీతిపై గ్రేటర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఐఎస్‌సదన్ డివిజన్‌తో పాటు, చార్మినార్‌జోన్ పరిధిలో నాలుగేళ్లుగా మంజూరైన జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని డిమాండ్ చేశారు. కొందరు ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మకై పనులు చేయకుండానే కోట్లాది రూపాయల ప్రజాధనం కాజేశారని ఆరోపించారు. పనులపై పూర్తి విచారణ జరిపి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తోట అమర్నాథ్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నేతలు మన్నె శ్రీనివాస్, బొమ్మల ప్రశాంత్, అశోక్, హరినాథ్ పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టేసిన హైకోర్టు

- ఆయన్నే చైర్మన్‌గా కొనసాగించాలని ఆదేశాలు



బాటసింగారం సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్‌పై డీసీవో జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈనెల 11న బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్‌పై వచ్చిన ఫిర్యాదుతో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి(డీసీవో) ఈనెల 14న చైర్మన్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. మరుసటి రోజు సంఘం డైరెక్టర్‌గా ఉన్న కొత్తపల్లి జైపాల్‌రెడ్డిని ఇన్‌చార్జి పర్సన్‌గా బాధ్యతలను అప్పగించారు. దీనిపై భరత్‌కుమార్ హైకోర్టుకు వెళ్లారు. కాగా ఈనెల 19న పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు భరత్‌కుమార్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టివేసింది. అదేవిధంగా జైపాల్‌రెడ్డిని ఇన్‌చార్జి పర్సన్ బాధ్యతలను డిస్‌పోజ్ చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జీవో నంబర్ 386 ప్రకారం భరత్‌కుమార్‌ను యథావిధిగా బాటసింగారం సహకార సంఘం చైర్మన్‌గా కొనసాగించాలని డీసీవోకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంఘం చైర్మన్‌గా భరత్‌కుమార్ తిరిగి కొనసాగనున్నారు.

ప్రభుత్వ బడులకు దాతల సహకారం సంతోషకరం

మన్సూరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులకు కావాల్సిన సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావడం సంతోషకరమని నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికులు సరస్వతి, కృష్ణ దంపతుల కుమార్తె శాన్వి 12వ పుట్టినరోజు సందర్భంగా బుధవారం పాఠశాలకు 9కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారికి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, రాజేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఖాన్‌బాయ్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శ

మన్సూరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్‌కాలనీ హకీమాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఖాన్‌బాయ్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కుడికాలి పిక్కలో తీవ్ర సమస్యతో ఇటీవల ఖాన్‌బాయ్ శస్త్రచికిత్స చేయించుకుని తన నివాసంలో విశ్రాంతిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి ఖాన్‌బాయ్‌ను పరామర్శించిన ఆయన ఆరోగ్యపరిస్థితిని గురించి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. వారి వెంట ఆగమయ్యకాలనీ అధ్యక్షుడు యాదయ్య, బాల్‌రాజ్‌గౌడ్, ప్రవీణ్, లచ్చిరెడ్డి ఉన్నారు.

రెడ్డిబస్తీలో పలువురిపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన వాహనదారుడు

చంపాపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని రెడ్డిబస్తీలో బుధవారం కుక్కలు దాడిచేయగా పలువురు గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న సందీప్, బన్ని అనే యువకులపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. కుక్కలు కాలనీల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువైనట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి కుక్కల దాడుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ : యువకుడి మృతి

చంపాపేట : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. పిసల్‌బండ నుంచి దాతునగర్ వైపు ఆక్టీవా(టిఎస్ 12ఈఎం 4604) బైక్‌పై బండ్లగూడకు చెందిన ఇబ్రహీం ఫాజల్(19) మరొకరు వెళ్తుండగా కంచన్‌బాగ్‌లోని బీడీఎల్ సీఐఎస్ఎఫ్ గేట్ ఎదుట మంగళవారం రాత్రి ప్రధాన రహదారిపై బాలాపూర్ నుంచి పిసల్‌బండ వైపు వెళ్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్(టీఎస్ 12ఈజి 7442)అతివేగంతో వచ్చి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆక్టీవా బైక్ నడుపుతున్న ఇబ్రహీం ఫాజల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు అతడిని పరీక్షించి మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఆక్టీవా బైక్‌పై ఉన్న మరొకరు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం ఎల్బీనగర్‌లోని శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఎండీ గౌసద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

కిరణ్‌గౌడ్ మృతదేహం లభ్యం



కిరణ్‌గౌడ్ మృతదేహం

బర్కత్‌పుర : భార్య మృతి చెందిందనే బాధతో మూసీలో దూకి ఆత్మహత్య చేసుకున్న డేటా ఆపరేటర్ కిరణ్‌గౌడ్(47) మృతదేహం బుధవారం లభ్యమైంది. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలి పిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్‌కు చెందిన బాలరాజుగౌడ్ కుమారుడు కిరణ్‌గౌడ్ ఆబిడ్స్‌లోని పే అండ్ అకౌంట్స్‌లో డేటా ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందింది. అతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 18న సాయంత్రం చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి మూసీలో దూకిన విషయం తెలిసిందే. అయితే కిరణ్‌గౌడ్ మృతదేహం బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచారం గ్రామ సమీపంలోని మూసీనది ఒడ్డున మురికి చెత్త వద్ద చిక్కుకొని ఉండగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. మూడు రోజులుగా కాచిగూడ పోలీసులు కిరణ్‌గౌడ్ మృతదేహం కోసం గాలించారని, బాచారం వద్ద లభించిందని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కిరణ్‌గౌడ్ మృతదేహాన్ని ఆయన కుటుంబసభ్యులకు అందించారు.